సాక్షి
ములుగు

గురువారం । 31 । ఆగస్టు । 2023



బాధితులకు సోదరులై..
ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఇటీవల కురిసిన వర్షాలతో సర్వం కోల్పోయిన వరద బాధితులకు స్వచ్ఛంద సంస్థలు, దాతలు చేయూతనందించారు. - 8లో▸



వైద్యసేవలపై నిర్లక్ష్యం తగదు
రోగులకు వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం తగదని ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్ఓ క్రాంతికుమార్ అన్నారు. - 9లో▸

గరిష్టం/కనిష్టం
33^0 / 26^0

వాతావరణం
జిల్లాలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు మామూలుగా ఉంటాయి. రాత్రి చల్లగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

కాల్వపల్లిలో పొట్ట పండుగ



ఎస్ఎస్‌తాడ్వాయి: మండల పరిధిలోని కాల్వపల్లిలో పొట్ట పండుగను పూజారులు, ఆదివాసీలు బుధవారం నిర్వహించారు. కొత్తగా వచ్చిన ధాన్యాన్ని ఉంచి పూజారులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి గద్దె వద్దకు తీసుకొచ్చారు. ప్రతిఏటా పొట్ట పండుగను నిర్వహించడం ఆనవాయితీ అని ఈ పండుగ చేసిన తర్వాతనే కొత్తగా పండించిన ధాన్యాలను స్వీకరిస్తామని పూజారులు తెలిపారు.

వైఎస్సార్‌టీపీకి రాజీనామా



ములుగు: వైఎస్సార్‌టీపీకి మూకుమ్మడి రాజీనామాలు చేసినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రామసహాయం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పార్టీ అభివృద్ధికి అధినాయకురాలు షర్మిల ఆదేశాల మేరకు తీవ్రంగా కష్టపడ్డామని తెలిపారు. ప్రస్తుతం షర్మిల పార్టీని ముందుకు తీసుకెళ్లే ఆశలు కనబడకపోవడంతో రాజీనామా చేస్తున్నట్లుగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అన్న తిరుపతి, దుగ్యాల ప్రవీణ్, పాయం నర్సింగరావు, నర్సింహా, సత్యం, శ్రీనివాస్, దిలీప్, ప్రతాప్, సమ్మయ్య, సంతోష్, ఆకాష్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం




ములుగు: జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలతో భారీగా నష్టపోయిన వరద బాధిత కుటుంబాలకు దేబాషిష్ మిత్ర జనరల్ మేనేజింగ్ నెట్‌వర్క్ డీజీఎం వివేక్ చంద్ర, జైస్వాల్ లక్ష రూపాయల చెక్కును కలెక్టర్ ఇలా త్రిపాఠికి బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ములుగు ఎస్‌బీఐ మేనేజర్ జనార్ధన్, ఎల్డీఎం రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కుసుమాంజలికి రూ.50వేల చెక్కు



ఏటూరునాగారం: ఎంబీబీఎస్‌లో సీటు పొందిన నిరుపేద గిరిజన విద్యార్థిని కొట్టెం కుసుమాంజలికి అడ్మిషన్ కోసం తక్షణ సాయంగా రూ.50 వేల చెక్కును ఐటీడీఏ పీఓ అంకిత్ బుధవారం అందజేశారు. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం ముచ్చర్లకు చెందిన ఆదివాసీ గిరిజన నిరుపేద కుటుంబానికి చెందిన కొట్టెం కుసుమాంజలి కరీంనగర్ ప్రతిమ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. ఉన్నత చదువు చదవాలని ఆకాంక్ష ఉన్నప్పటికీ ఫీజులు చెల్లించలేని దీన స్థితిలో ఉన్న అ విద్యార్థిని పరిస్థితిని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షులు దాట్ల నాగేశ్వర్‌రావు వాట్సప్‌లో పీఓ అంకిత్ దృష్టికి తీసుకెళ్లారు. దీని పై స్పందించిన పీఓ విద్యార్థిని అడ్మిషన్ ఫీజు కోసం తక్షణ సాయంగా బుధవారం కుసుమాంజలికి రూ.50 వేల చెక్కును అందజేశారు. పేద విద్యార్థి చదువుపై సానుకూలంగా స్పందించి అండగా నిలిచిన తీరు పట్ల తుడుందెబ్బ రాష్ట్ర నాయకులు నాగేశ్వరావు, సుధాకర్‌లు పీఓ అంకిత్‌కు ధన్యవాదాలు తెలిపారు.

చాక్‌పీస్‌పై రాఖీ ఆకృతి



కాటారం: మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో ఆర్ట్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న ఆడెపు రజనీకాంత్ రక్షాబంధన్‌ను పురస్కరించుకొని చాక్‌పీస్‌పై రాఖీ ఆకృతిని తయారు చేసి ఆకట్టుకున్నారు. 4 సెంటీమీటర్ల పొడవు, 8 మిల్లీమీటర్ల వెడల్పు ఉన్న రాఖీ ఆకృతిని చాక్‌పీస్‌పై సుమారు రెండు గంటల పాటు శ్రమించి తయారు చేసినట్లు రజనీకాంత్ తెలిపారు. అన్నాచెల్లెలు, అక్కాతమ్ముళ్ల మధ్య బంధానికి రక్షాబంధన్ ప్రతీకగా నిలుస్తుందని, ఆ ప్రత్యేకత తెలియజేయడం కోసమే ఈ అరుదైన ఆకృతిని తయారు చేసి శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కొందరికే బోనస్..

- కూలీలందరి ఖాతాల్లో జమకాని డబ్బులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న బాధితులు
- అర్హులందరికీ వేయాలంటూ డిమాండ్



ఎస్ఎస్ తాడ్వాయి: జిల్లాలోని తాడ్వాయి, ఏటూరునాగారం, వాజేడు, వెంకటాపురం, మంగపేట, కన్నాయిగూడెం, గోవిందరావుపేట మండలాల్లోని కూలీలు ఎక్కువగా తునికాకు సేకరిస్తుంటారు. తునికాకు సీజన్ వచ్చిందంటే ఇంటిల్లిపాది తునికాకు సేకరణకు వెళ్లి ఒక్కో కూలీల కుటుంబం సుమారు రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు సంపాదించి వారి అవసరాలు తీర్చుకుంటుంది. కూలీలు సేకరించిన ఆకుల కట్టల సంఖ్యను బట్టి బోనస్ డబ్బులు సైతం చెల్లిస్తుంటారు. ఈ క్రమంలో కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న బోనస్ డబ్బులను తెలంగాణ అటవీ శాఖ, రూరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా కూలీల ఖాతాల్లో జమ చేస్తోంది. ఆకు సేకరించిన కూలీలందరికీ డబ్బులు జమ చేయాల్సి ఉండగా కొంతమంది ఖాతాల్లో మాత్రమే జమ చేయడంతో మిగితా కూలీలందరూ ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలోని తొమ్మిది మండలాల పరిధిలో 41వేల మంది కూలీలు ఆకు సేకరణ పనులకు వెళ్లినట్లు అటవీశాఖ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. 2015 నుంచి 2021 వరకు పెండింగ్‌లో ఉన్న బోనస్ డబ్బులను కూలీల ఖాతాల్లో అధికారులు జమ చేస్తున్నారు. అయితే అందరికీ కాకుండా కొంతమంది ఖాతాల్లోనే జమ చేస్తున్న తీరుతో అధికారులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆ కొంత మందిలో కూడా రూ.10 వేల నుంచి లక్ష వరకు ఖాతాల్లో జమ అవుతున్నాయని బాహాటంగా ప్రచారం సాగుతోంది. కానీ తునికాకు సేకరించిన కొంతమంది కూలీలకు ఒక్క రూపాయి కూడా



బోనస్ జమ కాకపోవడంతో కూలీలు విస్మయానికి గురవుతున్నారు. ఇదే విషయంపై మంగళవారం ఏటూరునాగారం అటవీశాఖ కార్యాలయం ఎదుట బోనస్ డబ్బులు పడని కూలీలు ధర్నాకు దిగి నిరసన వ్యక్తం చేశారు.

లెక్కాపత్రం లేకుండా చెల్లింపులు

కొంత మంది ఖాతాల్లో జమ అవుతున్న డబ్బులు లెక్కాపత్రం లేకుండా జమ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తునికాకు సేకరించిన కూలీల జాబితాను అటవీశాఖ అధికారులు తయారు చేసి పై అధికారులకు సమర్పించాల్సి ఉండగా, కల్లెదారులు, బీట్ ఆఫీసర్లు ఇచ్చిన కొంత మంది పేర్ల జాబితాను మాత్రమే అటవీ శాఖ అధికారులు పంపించారని విమర్శలు వస్తున్నాయి. ఈ క్రమంలో అర్హులైన కూలీల పేర్లను పంపించక పోవడంతోనే వారి ఖాతాల్లో బోనస్ డబ్బులు పడడం లేదని ఆరోపిస్తున్నారు.

బోనస్ డబ్బులు పడలేదు..



తునికాకు బోనస్ డబ్బులు ఒక రూపాయి కూడా ఖాతాలో జమ కాలేదు. బోనస్ డబ్బులు ఖాతాలో జమ అవుతున్నాయని తెలియడంతో బ్యాంకుకు వెళ్లి ఖాతాను చెక్ చేసుకున్నాను. డబ్బులు పడలేదు. తన కుటుంబం ప్రతిఏటా ఆకు సేకరణ పనులకు వెళ్తుంటాం. ప్రతిఏటా రూ.10 వేలకు పైగానే తునికాకు సేకరణ ద్వారా డబ్బులు సంపాదిస్తాం. అయినా మాకు మాత్రం బోనస్ డబ్బులు జమ కాలేదు. వస్తాయో రావో అని తెలియకుండా ఉంది.

– మద్దెల వినోద, తునికాకు కూలీ

కూలీలందరికీ చెల్లింపు..

జిల్లాలోని తునికాకు కూలీలకు బోనస్ డబ్బులు ఖాతాల్లో జమఅవుతున్నాయి. జిల్లా మొత్తంగా కూలీల జాబితాను సేకరించి అప్పటి కలెక్టర్ కృష్ణ ఆదిత్యకు సమర్పించాం. విడతల వారీగా కూలీలకు బోనస్ డబ్బులు ఖాతాల్లో పడుతున్నాయి. కొంత మంది కూలీలకే బోనస్ డబ్బులు పడుతున్నాయని రానివారు అందోళన చెందాల్సిన పనిలేదు. జాబితా ప్రకారం కూలీలందరికీ విడతల వారీగా బోనస్ డబ్బులు పడతాయి.

– రాహుల్ కిషన్ జాదవ్, డీఎఫ్ఓ

ఫెన్సింగ్ పనుల పరిశీలన



చిలకలగుట్టకు ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌ను పరిశీలిస్తున్న పీఓ అంకిత్

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారంలోని చిలకలగుట్ట చుట్టూ రక్షణకు ఏర్పాటు చేస్తున్న ఫెన్సింగ్ పనులను ఐటీడీఏ పీఓ అంకిత్ బుధవారం పరిశీలించారు. చిలుకలగుట్ట చుట్టూ ఏర్పాటు చేస్తున్న ఫెన్సింగ్ పనులను ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ హేమలత, ఐటీడీఏ స్టాటిస్టికల్ అధికారి రాజ్‌కుమార్‌లతో కలిసి 4 కిలోమీటర్లు పీఓ కాలినడకన వెళ్లి పరిశీలించారు. గతంలో కొంత మేరకు ఏర్పాటు చేసిన పాత ఫెన్సింగ్, కొత్తగా ఏర్పాటు చేస్తున్న ఫెన్సింగ్ పనుల నాణ్యతను పరిశీలించారు. చిలకలగుట్ట వద్దకు భక్తులు, ఇతరులు వెళ్లకుండా నిషేధిత ప్రాంతమని, గుట్ట వద్దకు రావడానికి అనుమతి లేదని భక్తులు సహకరించాలని సూచికగా సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని ఈఈ హేమలతను ఆదేశించారు. అనంతరం చిలుకలగుట్ట వద్ద నిర్మించిన ప్రహరీపై రూపొందించిన 'కోయ పాటోగ్రఫీ', మ్యూరల్ పెయింటింగ్‌ల చిత్రాలను ఆయన పరిశీలించారు. పెయింటింగ్‌ల ఏర్పాటును వేగవంతంగా పూర్తయ్యేలా చూడాలని స్టాటిస్టికల్ అధికారి రాజ్‌కుమార్‌ను ఆదేశించారు.

రెండో ఏఎన్ఎంలకు షోకాజ్ నోటీస్



షోకాజ్ నోటీస్ అందిస్తున్న డీఎంహెచ్ఓ అప్పయ్య

ములుగు: సమ్మెను విరమించుకోవాలని డీఎంహెచ్ఓ అల్లెం అప్పయ్య రెండో ఏఎన్ఎంలకు షోకాజ్ నోటీస్ అందజేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ పక్కన నిర్వహిస్తున్న సమ్మె ప్రాంతానికి బుధవారం ఆయన చేరుకొని సమ్మె విరమించుకోవాలని సూచించారు. లేని పక్షంలో ప్రభుత్వం తరఫున నియమించే పోస్టులకు అనర్హులుగా ప్రకటించబడతారని హెచ్చరించారు. ఇదిలా ఉండగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ మాట్లాడుతూ 16ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న రెండో ఏఎన్ఎంల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. న్యాయపరమైన హక్కులు పరిష్కరించాలని 15 రోజులుగా సమ్మె చేస్తున్నా పట్టించుకోకపోవడం బాధాకరం అన్నారు. ప్రభుత్వం జారీ చేసిన షోకాజ్ నోటీస్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. సమస్యలపై తగిన హామీ ఇస్తే వెంటనే సమ్మె విరమించుకోవడానికి రెండో ఏఎన్ఎంలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో రెండో ఏఎన్ఎం రాష్ట్ర నాయకురాలు జమునా రాణి, నాగమణి, సీత, అనురాధ, తిరుమల, శ్రీలత, కల్పన, ఉషా, భాగ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

మహదేవపూర్: మొక్కలు నాటి సంరక్షించాలని, మూడు రోజుల్లో లక్ష్యం పూర్తి చేయాలని జెడ్పీ సీఈఓ విజయలక్ష్మి అన్నారు. మండలంలోని అన్నారం గ్రామంలో బుధవారం మొక్కలు నాటు కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి మొక్క మీటరు పొడవు ఉన్న వాటినే నాటాలని ఉపాధి హామీ ఏపీఓను ఆదేశించారు. అనంతరం ఎంపీడీఓ సందర్శించారు. జెడ్పీటీసీ అరుణ ఆధ్వర్యంలో సరస్వతి శిశు మందిర్ విద్యార్థులు జెడ్పీసీఈఓకు, ఎంపీడీఓ రవింద్రనాథ్, తహసీల్దార్ లక్ష్మరాజంకు రాఖీ కట్టారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ సభ్యులు

ములుగు: తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల జేఏసీ సభ్యులు బుధవారం విద్యాశాఖ కార్యాలయం ఎదుట ప్లకార్డులతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా అధ్యక్షుడు చల్లా భాస్కర్ రెడ్డి మాట్లాడారు. సమగ్ర శిక్షా అభియాన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత, కనీస వేతన స్కేలు అమలు చేయాలని పలుమార్లు ప్రభుత్వ అధికారులు, మంత్రులను కోరినా పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. సిస్టమ్ అనాలిస్టు టెక్నికల్ పర్సన్ , డాటా ఎంట్రీ ఆపరేటర్స్, డీఎల్ఎంటి అటెండర్, కో ఆర్డినేటర్, మెసెంజర్, సీఆర్పీలు, పీఈటీలు, కేజీబీవీ, పీజీ సీఆర్‌టీ, ఏఎన్ఎం, అకౌంటెంట్, క్రాఫ్ట్ టీచర్స్, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్చర్స్, వాచ్ మెన్, స్కావెంజర్స్ హోదాలో 15 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నా ప్రభుత్వం ఇప్పటి వరకు రెగ్యులరైజేషన్ చేయకపోవడం దారుణమన్నారు. ఏపీ, ఒడిశా, హర్యానా, ఢిల్లీ, మహారాష్ట్రల్లో ఇప్పటికే సంబంధిత ఉద్యోగులను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు రెగ్యులరైజేషన్ చేశాయని వివరించారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష జేఏసీ అధ్యక్షుడు చల్లా భాస్కర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సోమడి కరుణాకర్, కోశాధికారి కుమార్ పాడియా, ఉపాధ్యక్షుడు విష్ణుతో పాటు 215 మంది ఉద్యోగులు పాల్గొన్నారు.

కుటుంబపాలన నుంచి త్వరలోనే విముక్తి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి



కండువా కప్పి బీజేపీలోకి యువకులను ఆహ్వానిస్తున్న భాస్కర్‌రెడ్డి

వెంకటాపురం(ఎం): సీఎం కేసీఆర్ కుటుంబ పాలన నుంచి తెలంగాణకు విముక్తి కలిగించే రోజులు దగ్గరలోనే ఉన్నాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని తాళ్లపాడులో బుధవారం నిర్వహించిన బీజేపీ కార్యకర్తల సమావేశానికి మండలాధ్యక్షుడు కారుపోతుల యాదగిరి అధ్యక్షత వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నిరంకుశపాలనతో ఉద్యోగులు, నిరుద్యోగులు, రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆరోపించారు. బీజేపీతోనే తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి సాధ్యమన్నారు. కేంద్రంలో ప్రధాని మోదీ పాలన ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. తెలంగాణలో కాషాయజెండా ఎగురవేసేందుకు ప్రతీ కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని పట్వారిపల్లెకు చెందిన 50 మంది యువకులు బీజేపీలో చేరగా వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు భూక్య జవహర్‌లాల్, నాయకులు సిరికొండ బలరాం, తక్కెళ్లపల్లి దేవేందర్, మండల విజయ్‌కుమార్‌రెడ్డి, వైద్యుల తిరుపతిరెడ్డి, జినుకల కృష్ణాకర్‌రావు, మందల వెంకటరమణారెడ్డి, గూడెపు సంతోష్, కన్నెబోయిన వీరేందర్, సుమన్ రావు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకోవాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి నారాయణబాబు



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి నారాయణబాబు

భూపాలపల్లి: సెప్టెంబర్ 2న జరుగనున్న ముందస్తు లోక్ అదాలత్, సెప్టెంబర్ 9న జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ పి.నారాయణబాబు సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కోర్టులో లోక్ అదాలత్ సమన్వయ సమావేశం జరిగింది. పోలీసులు, న్యాయవాదులతో జరిగిన వేర్వేరు సమావేశంలో జడ్జి మాట్లాడారు. జాతీయ లోక్ అదాలత్‌ను అందరూ సద్వినియోగం చేసుకొని రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కోర్టు ప్రాంగణాల్లో ప్రీ లిటిగేషన్స్, ఎలక్ట్రిసిటీ, మోటార్ యాక్సిడెంట్ కేసులు, ఇన్సూరెన్స్, కంపౌండింగ్ క్రిమినల్ కేసులు, చెక్‌బౌన్స్, మెయింటనెన్స్, ఫ్యామిలీ డిస్ప్యూట్స్, బ్యాంకు లోన్ తగాదాలు, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు పరిష్కరించబడతాయని తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించిన కేసులు ప్రతీరోజు పరిష్కరించబడతాయన్నారు. లోక్ అదాలత్‌ను ప్రతీరోజు అనగా వచ్చే నెల 2వ తేదీ నుంచి 9వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని, 9న జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కారించుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కే.జయరాంరెడ్డి, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.రామచంద్రరావు, అడిషనల్ ఎస్పీ ఎస్.రమేష్, ఎక్సైజ్ డీఎస్పీ ఎం.లింగాచారి, డీఎస్పీ బి.నారాయణ, న్యాయవాదులు, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ మెరుగు రవీందర్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ గార్లపాటి ప్రియాంక, పోలీసు అధికారులు, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంకర్లు రుణ లక్ష్యం చేరుకోవాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



ములుగులో బ్యాంకర్లతో మాట్లాడుతున్న కలెక్టర్

ములుగు/కన్నాయిగూడెం: బ్యాంకర్లకు ఇచ్చిన రుణ లక్ష్యం చేరుకోవాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించిన ఆర్థిక సహాయాన్ని అర్హులైన లబ్ధిదారులకు అందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆయా బ్యాంకుల ప్రతినిధులతో బుధవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంట, విద్య, ఎస్సీ, ఎస్టీ రుణాలు, పీఎం అజయ్ పథకాలకు సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్యాలెండర్ ప్రకారం ఫైనాన్షియల్ లిటరసీ ప్రోగ్రాంను బ్యాంకుల వారీగా లాంచ్ చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను డాక్యుమెంటేషన్ వారీగా గ్రౌండింగ్ చేయాలన్నారు. పీఎం అజయ్ ప్రోగ్రాం కింద ఎస్సీ, ఎస్టీ దిగువ తరగతి వర్గాలను గుర్తించి పేదరికాన్ని తగ్గించడానికి ఆర్థిక సాయం అందించాలన్నారు. ఈ సమావేశంలో ఎల్‌డీఎం రాజ్‌కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, తహసీల్దార్ విజయ భాస్కర్, ఎస్‌బీఐ, ఇతర బ్యాంకు ప్రతినిధులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలి



కన్నాయిగూడెంలో అధికారులకు సూచనలు చేస్తూ..

కన్నాయిగూడెం మండల పరిధిలోని అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. కన్నాయిగూడెం వెనుకబడిన మండలం కావడంతో నీతిఅయోగ్ కింద మండలానికి రూ.2కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. ఈ సందర్భంగా బుధవారం మండలంలో కలెక్టర్ పర్యటించి ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. మండల పరిధిలోని మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. తక్షణమే కావాల్సిన పనులకు నివేదికలు తయారు చేసి కలెక్టరేట్‌లో అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ జిల్లాలో కన్నాయిగూడెం మండలం వెనుకబడిన ప్రాంతం కావడంతో నీతి అయోగ్ నుంచి మండలానికి నిధులు వచ్చాయని కావాల్సిన పనులకు నివేదికలు తయారు చేసి పనులను వెంటనే చేపట్టాలన్నారు. రోడ్లు, భవనాలు, వైద్యం వంటి కోసం నివేదికలు తయారు చేయాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరికీ ఓటు హక్కును కల్పించాలని రెవెన్యూ అధికారులకు తెలిపారు. ఓటు హక్కు విలువను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జనగం సమ్మక్క, తహసీల్దార్ సలీమ్, ఎంపీడీఓ పని చంద్ర, డీపీఓ వెంకయ్య, స్పెషల్ అధికారి, సీడీపీఓ హేమలత, ఎంఈఓ రాజేష్, వైద్యాధికారి అభినవ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గణేశ్, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పట్టణంలో రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు



రాఖీ సందడి

భూపాలపల్లి అర్బన్: రాఖీ పండగ సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలో సందడి నెలకొంది. జిల్లా కేంద్రంలోని విద్య సంస్థల్లో రక్షాబంధన్ వేడుకలను ముందస్తుగా నిర్వహించారు. విద్యార్థినులతో రాఖీలు కట్టించి సోదరభావాన్ని గుర్తు చేశారు. పండగను పురస్కరించుకొని ప్రధాన రహదారి వెంట నూతనంగా రాఖీల దుకాణాలు ఏర్పాటు చేశారు. మహిళలు, యువత రాఖీలు కొనుగోలు చేసేందుకు అధిక సంఖ్యలో తరలిరావడంతో దుకాణాలు, కంగన్‌హాల్లు కిటకిటలాడాయి. స్వీట్ల కొనుగోలుకు స్వీట్‌హౌస్‌లు, బేకరీలు నిండిపోయాయి. రాఖీల ధరలు గత ఏడాది కంటే ఈ ఏడాది అధికంగా పెరిగినట్లు వినియోగదారులు అంటున్నారు.



సన్‌వ్యాలీ పాఠశాలలో రక్షాబంధన్‌లో పాల్గొన్న విద్యార్థులు

ఎటు పోదాం?

అనుచరులతో 'పోదెం' చర్చ
- బీఆర్ఎస్ పార్టీ నుంచి టికెట్ ఆశించినా దక్కని వైనం
- మద్దతు కోరుతున్న ప్రధాన పార్టీలు



పోదెం కృష్ణప్రసాద్

ములుగు: భద్రాచలం ఎమ్మెల్యేగా ఉన్న పోదెం వీరయ్య కుటుంబానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పోదెం కృష్ణప్రసాద్ రాజకీయాల వైపు అడుగులు వేశారు. ఈ క్రమంలో ఈ నెల 23న తన ప్రభుత్వ ఉపాధ్యాయ(కన్నాయిగూడెం ఆశ్రమ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్) పదవికి రాజీనామా చేసి ప్రజా క్షేత్రంలో పోటీ చేయడానికి సిద్ధమయ్యారు. ముందుగా బీఆర్ఎస్ తరఫున టికెట్ ఆశించినప్పటికీ అధికార పార్టీ నాగజ్యోతికి టికెట్ కేటాయించింది. అయితే అధికార పార్టీ తరఫున టికెట్ ఆశించిన పోదెం కృష్ణప్రసాద్ భంగపడ్డారు. దీంతో జిల్లా వ్యాప్తంగా పోదెం ప్రస్థానం ప్రశ్నార్థకంగా మారడంతో ఎటు పోదాం అనే ఆలోచనలో ఉన్న పోదెం తన అనుచరులతో మూడు రోజులుగా చర్చిస్తున్నారు. వారి అభిప్రాయాల మేరకు తన దారిని మళ్లించుకుని ఇతర పార్టీలకు వెళ్లే ఆలోచనలో ఉన్నారు. ఈ క్రమంలో ప్రధాన పార్టీలైన బీజేపీ, బీఎస్పీ వంటి పార్టీలు కృష్ణప్రసాద్ వైపు మొగ్గు చూపుతున్నాయి. సాధారణంగా పోదెంకు నియోజకవర్గ వ్యాప్తంగా భారీగా మద్దతు దారులు ఉన్నారు. ఇది ఇలా ఉండగా ఏ పార్టీలోకి చేరాలనే విషయంలో కృష్ణ ప్రసాద్ తర్జన భర్జన పడుతున్నారు. ఒక వేళ ఆయన ఏదైనా పార్టీ తరఫున పోటీ చేస్తే ములుగు నియోజకవర్గంలో ముఖ్యంగా ఆదివాసీ ఓట్లతో పాటు ఉద్యోగ, ఉపాధ్యాయ ఓట్లు భారీగా చీల్చే అవకాశం కనిపిస్తోంది. ఇదే కనుక జరిగితే అధికార బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి నాగజ్యోతికి తీవ్రనష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ హై కమాండ్ కృష్ణ ప్రసాద్‌ను బుజ్జగించే పనిలో ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఆయన అనుచరులు ప్రజా సంఘాలు, ఉద్యోగ సంఘాలు బీఆర్ఎస్ అభ్యర్థికి మద్దతుగా ఉండాలని అందుకు సహకరించాలని కోరుతున్నట్లుగా తెలుస్తోంది. అయితే కృష్ణప్రసాద్ మాత్రం ఈసారి ఏది ఏమైనా అసెంబ్లీ ఎన్నికల బరిలో ఉంటానని భీష్మించుకుని కూర్చున్నారని ఆయన అనుచర వర్గాలు చెబుతున్నాయి. ఇది ఇలా ఉండగా ప్రధాన పార్టీలైన కాంగ్రెస్ తరఫున ఆదివాసీ అభ్యర్థి ధనసరి అనసూయ, బీఆర్ఎస్ తరఫున మరో ఆదివాసీ అభ్యర్థి బడే నాగజ్యోతి పోటీలో ఉన్న తరుణంలో పోదెం కృష్ణ ప్రసాద్ అసెంబ్లీ ఎన్నికల పోటీలో నిలబడటానికి సిద్ధంగా ఉన్నట్లుగా తెలువడంతో ఈ విషయం నియోజక వర్గ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే ఆదివాసీ సామాజిక వర్గం తరఫున సీతక్క, బడే నాగజ్యోతిలకు టిక్కెట్లు ఖరారు కాగా లంబాడ సామాజిక వర్గం నుంచి మాజీ మంత్రి తనయుడు అజ్మీరా ప్రహ్లాద్ పోటీలో ఉంటానని ప్రకటించడం అదే సమయంలో ఆదివాసీ సామాజిక వర్గానికి పోదెం కృష్ణ ప్రసాద్ పోటీకి సిద్ధం కావడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది.

నిబంధనలు అతిక్రమిస్తే జైలు

ఏటూరునాగారం: ఆర్ఎంపీ వైద్యులు నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని జిల్లా ఎన్సీడీ ప్రోగ్రాం అధికారి మంకిడి వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మండల పరిధిలోని పలు ఆర్ఎంపీల వైద్యశాలలను బుధవారం తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్ఎంపీలు తమ వద్దకు వచ్చే రోగులకు ప్రథమ చికిత్స అందించి ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేయాలన్నారు. అక్రమంగా అబార్షన్లు, అతిగా యాంటీ బయోటిక్స్ వాడితే ఆస్పత్రిని సీజ్ చేస్తామని హెచ్చరించారు.

క్లుప్తంగా

ఉమ్మడి జిల్లా వాసికి కీలక బాధ్యత



హన్మకొండ: బీజేపీ తెలంగాణ రాష్ట్ర డాటా అండ్ కాల్ సెంటర్ టీమ్ కన్వీనర్‌గా ఉమ్మడి వరంగల్ జిల్లావాసి రావుల భరత్ రెడ్డికి అధిష్టానం కీలక బాధ్యత అప్పగించింది. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం హరిపిరాల గ్రామానికి చెందిన రావుల భరత్‌రెడ్డి విద్యార్థి దశలోనే ఏబీవీపీలో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. యూకేలో ఉన్నత విద్య పూర్తి చేసి అక్కడే ఉద్యోగం చేసిన ఆయన.. రాజకీయాలపై మక్కువతో స్వదేశం చేరుకుని బీజేపీలో కీలక బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా భరత్ రెడ్డి మాట్లాడుతూ తనను ఈ పదవిలో నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి, సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



కరెంట్‌షాక్‌కు గురై మృతి చెందిన రైతు శంకర్

తొర్రూరు రూరల్: విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని టీక్యాతండా జీపీ శివారు జగ్న తండాలో జరిగింది. తండాకు చెందిన జాటోత్ శంకర్(50) బుధవారం తన పశువులకు పొలంలో గడ్డి కొస్తున్నాడు. ఈ క్రమంలో వేలాడుతున్న కరెంట్ సర్వీస్ వైర్‌ను గమనించకుండా తాకాడు. దీంతో విద్యుత్ సరఫరా అయి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై భార్య సోమక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తొర్రూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై జగదీష్ తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు.

బాధితులకు సోదరులై..

వరదతో సర్వస్వం కోల్పోయిన వారికి ఆత్మీయ బంధువులుగా నిలిచారు..

వారు అక్కాతమ్ముళ్లు కాదు.. చెల్లి అన్నయ్యలు కాదు.. అసలే రక్త సంబంధం కాదు.. ఒకరంటే ఒకరికి పరిచయం లేదు. కానీ వారిని ఓ బంధం కలిపింది. అదే వరద బంధం. తోబుట్టువులు కూడా ఆదరించలేని ఈ రోజుల్లో ఎలాంటి సంబంధం లేని వారు 'అధైర్య పడకండి.. మేమున్నామంటూ' క'న్నీటి' వరద నుంచి కాపాడారు. ఇటీవల కురిసిన వర్షం వరంగల్ నగరంతోపాటు భూపాలపల్లి జిల్లా మోరంచపల్లి, ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని పలు గ్రామాల్లో బీభత్సం సృష్టించింది. నిత్యావసరాల నుంచి గృహోపకరణాల వరకు సర్వం వరదలో కొట్టుకుపోయాయి. కట్టుబట్టలు మాత్రమే మిగిలి హాహాకారాలు చేస్తున్న సమయంలో తామున్నమంటూ స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకువచ్చారు. తమకు తోచిన సాయం అందించి వరద బాధితులను క'న్నీటి' కష్టం నుంచి గట్టెక్కించారు. దీంతో నిరాశ్రయులు వారికి శతకోటి వందనాలు పెట్టారు. ఆపదలో కాపాడిన వారే తమకు నిజమైన రక్తసంబంధీకులు అని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నేడు రాఖీ పౌర్ణమి సందర్భంగా వరద బాధితలకు చేయూతనందించి ప్రేమబంధం చాటిన వారిపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

– ఖిలావరంగల్/భూపాలపల్లి అర్బన్/ ఏటూరునాగారం

సోదరుల్లా అక్కున చేర్చుకున్నారు..

- సామాజిక సేవలో శివనగర్ మిత్ర మండలి ఆదర్శం..
- వరద బాధితులకు పలు రకాలుగా చేయూత

వరద ముంపు బాధితులకు శివనగర్‌లో ఏర్పాటు చేసిన శివనగర్ మిత్రమండలి, వీరలక్ష్మి ఫౌండేషన్ అండగా నిలిచింది. మానవతా దృక్పథంతో మేమున్నామంటూ నిత్యావసర సరుకులు, దుప్పట్లు అందజేసింది. వరదల్లో చిక్కుకుని కనీసం తాగేందుకు నీరు, తినడానికి ఆహారం కూడా లభించని సమయాన బాధితుల కన్నీళ్లు తుడిచేందుకు శివనగర్ మిత్ర మండలి, వీరలక్ష్మి ఫౌండేషన్ చైర్మన్ మేరుగు అశోక్ తోబుట్టువులా ముందుకు వచ్చారు. బాధితులను అక్కున చేర్చుకుని ఆహార ప్యాకెట్లు పంపిణీ చేసి వారి ఆకలితీర్చారు. దీంతో పలువురు సమాజసేవకులు మేరుగు అశోక్‌పై ప్రశంసల వర్షం కురిపించారు.



వరద బాధితులకు కూరగాయలు అందజేస్తున్న ఫౌండేషన్ బాధ్యులు (ఫైల్)

తోబుట్టువులా ఆదుకున్నారు..



ఇటీవల కురిసిన వర్షాలకు మా కాలనీ మొత్తం జలమయమైంది. కాలు బయట పెట్టలేని పరిస్థితి. ఆ సమయంలో తాగునీరుకు తీవ్ర ఇబ్బందులు పడ్డాం. దీంతో మీకు మేమున్నామంటూ శివనగర్ మిత్ర మండలి, వీరలక్ష్మి ఫౌండేషన్ బాధ్యులు ముందుకువచ్చారు. తోబుట్టువులా నిలిచి మమ్ములను ఆదుకున్నారు. వారే నాకు నిజమైన సోదరులు. వారికే రాఖీ కట్టి సోదరభావం చాటుకుంటా.

అల్లం స్వరూప, శివనగర్

రక్త సంబంధీకులు కాకపోయినా..



గత నెలలో కురిసిన భారీ వర్షాలకు గ్రామంలో ప్రతి ఇంట్లో వస్తువులు కొట్టుకుపోయి ఇబ్బందులు పడ్డాం. మా బాధలను తెలుసుకున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అన్ని రకాల సహకారం అందించారు. రక్త సంబంధీకులు కాకపోయినా ఎక్కడి నుంచో వచ్చి మాకు సరుకులు అందించారు. వారి సహకారంతో కొంత ఉపశమనం పొందాం.

-కొత్త సుదర్శన్‌రెడ్డి, రైతు మోరంచపల్లి

వారి సహకారం మరువలేనిది




గ్రామంలో వరద కారణంగా ఇబ్బందులు ఎదుర్కొనగా కుటుంబీకులు, తోడ పుట్టిన వారు ఓదార్పే తప్ప ఎవరూ ఆదుకోవడానికి ముందుకు రాలేదు. కానీ వేర్వురు గ్రామాల నుంచి మాకు పరిచయం లేని వ్యక్తులు వచ్చి వంట సామాను, చద్దర్లు, డబ్బు, అన్నదానం, మంచి నీళ్ల పంపిణీ చేశారు. వారి సహకారం జీవితంలో మర్చిపోలేం.

-చుక్క కవిత, గృహిణి, మోరంచపల్లి

హసన్‌పర్తి: రాఖీ ఆకారంలో పెంబర్తిలోని ఏకశిల టెక్నో పాఠశాల విద్యార్థులు







సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

■హన్మకొండ సప్తగిరి కాలనీలో 150 చ॥గ॥ల నార్త్ ఫేసింగ్ గల ప్లాటు అమ్మకానికి కలదు. (నో బ్రోకర్స్) సంప్ర॥ సెల్: 9441001574. [W-189158]

HOUSE FOR SALE

■ఉర్సుగుట్ట నుండి ఖాజీపేట్ వెళ్లె 150 ఫీట్ల రోడ్డు ప్రక్కన బట్టుపల్లి SR Prime School కు ఎదురుగా 2 & 3 BHK Independent Houses అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-27212]

FLATS FOR SALE

■KUDA కాలనీ 100 ఫీట్ల రోడ్డు, SPR School కు దగ్గరలో Stilt Plus 5 ఫ్లోర్స్ అపార్ట్‌మెంటులో 2 & 3 BHK Luxury Flats అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-27215]

HOUSE FOR SALE/RENT

■హన్మకొండ హంటర్ రోడ్ సమీపంలో 280 చ॥గ॥లో 3BHK ఇండిపెండెంట్ హౌజ్ అమ్మకానికి లేదా అద్దెకు ఇవ్వబడును. సెల్: 9949184625. [W-189153]

FARM PLOTS FOR SALE

■ఆనందవనం ఫేజ్ 7 నందు ఫామ్ ల్యాండు కొలన్‌పాక, యాదాద్రి నందు ఫామ్ ల్యాండు ఆఫర్ 5+1 ప్లాట్ నందు 5 తీసుకొన్న 1 ప్లాట్ ఫ్రీ Plot Rate 4999/-. సంప్ర॥ 9014743326. [W-189141]

WANTED

■మా రియల్ ఎస్టేట్ సంస్థలో పనిచేయుటకు అసోసియేట్ మెంబర్స్ మరియు టెలికాలర్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం+ ఇన్సెంటీవ్స్ + కమీషన్ ఇవ్వబడును. సంప్ర॥ 9959567858. [W-189148]

■WGL, Experienced కార్ టెక్నీషియన్స్, హెల్పర్స్ కావలెను. సాలరీ: 20,000/- మా మోటార్స్ ములుగు X రోడ్ వరంగల్, సెల్: 9948434745, 9000687574. [WA-541]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9010144453
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మోరంచపల్లిలో వరద బాధితులకు బియ్యం పంపిణీ చేస్తున్న రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు (ఫైల్)



స్వచ్ఛంద సంస్థలు, దాతల ఔదార్యం

- వరద బాధితులకు ఆపన్నహస్తం

ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం కొండాయి, మల్యాల, దొడ్ల గ్రామాల్లో గత నెలలో సంభవించిన వరదలతో గ్రామస్తులు సర్వస్వం కోల్పోయారు. కట్టుబట్టలు మాత్రమే మిగిలి పుట్టెడు దుఃఖంలో వీరికి స్వచ్ఛంద సంస్థలు, దాతలు అండగా నిలిచాయి. సోదరుల వలే మనోధైర్యం నింపుతూ నిత్యావసరాలు, దుస్తులు అందజేసి ఆసరా అయ్యారు. దీంతో ఆడబిడ్డకు పుట్టినింటి నుంచి పంపినట్లు నిత్యావసరాలు అందజేసి తమను ఆదుకున్నారని, వీరి సేవలను జన్మలో మరిచిపోలేమని వరద బాధితులు పేర్కొన్నారు.

వరదలతో అతలాకుతలం



వరదలతో కొండాయి గ్రామం పూర్తిగా అతలాకుతలమైంది. నిరాశ్రయులుగా మిగిలిన మమ్ములను స్వచ్ఛంద సంస్థలు, మహిళా ప్రతినిధులు అక్కా, చెల్లెల్లవలే వచ్చి ఆదుకున్నారు. కట్టుబట్టలతో రోడ్డున పడిన మాకు దుస్తులు, బియ్యం, నిత్యావసర సరుకులు అందచేసి ఆదుకున్నారు. వారి సహాయాన్ని ఎప్పటికీ మర్చిపోలేం.

-కట్ల సందీప్, కొండాయి

సొంతోళ్లు కూడా ఇలా చేయరు..



ఇల్లు నీటిలో మునిగి దిక్కుతోచని స్థితిలో ఉన్న సమయంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, దాతలు మా దగ్గర వచ్చి కావాల్సిన వస్తువులు అందజేసి ఆదుకున్నారు. సొంతోళ్లు కుడా ఇలా చేయరు. దీనిపై వారికి జన్మజన్మలకు రుణపడి ఉంటాం.

-బొల్లికుంట లక్ష్మి,మల్యాల

కంబాలపల్లిలో వృక్ష రక్షాబంధన్

- పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండలం కంబాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు బుధవారం మొక్కలు, చెట్లకు రక్షాబంధన్ చేశారు. తమ పరిసరాల్లోని మొక్కలు, చెట్లను కాపాడుతామని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. అనంతరం హెచ్ఎం రమేశ్ బాబు మాట్లాడుతూ చెట్లు పర్యవరణం, మానవులకు చేస్తున్న మేలును తెలియజేసే ఉద్దేశంతో వృక్ష రక్షాబంధన్ నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం ఉపాధ్యాయుడు, పర్యావరణ పరిశోధకుడు వి.గురునాథరావు మాట్లాడుతూ విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ అవసరంపై అవగాహన ఉండాలన్నారు. 15 సంవత్సరాలుగా ఈ వృక్ష రక్షాబంధన్ దివస్ జరుపుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకట్రామనర్సయ్య, ఉప్పలయ్య, శ్రీనివాస్, తిరుపతి, సోమేశ్వర్, శోభారాణి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



వృక్ష రక్షాబంధన్ వేడుకలు జరుకుంటున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

చంద్రయాన్-3 పై అవగాహన

గార్ల: చంద్రయాన్–3పై గార్ల వాసి, ఇస్రో డిప్యూటీ డైరెక్టర్ గంజి వెంకటనారాయణ బుధవారం గార్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రయాన్–3తో చంద్రుడి దక్షిణార్ధ గోళంలో విద్యుత్‌శక్తిని ఉత్పత్తి చేసే హీలియం ఖనిజం నిక్షిప్తమైనట్లు గుర్తించామన్నారు. పది కేజీల హీలియం ఖనిజం పొందగలిగితే రాష్ట్రానికి సంవత్సరం పాటు విద్యుత్‌ను అందించవచ్చని పేర్కొన్నారు. అనంతరం ఆయనను అధ్యాపకులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు చార్లి, అజిత్, సుందరయ్య, రాజేష్, వెంకన్న, సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.



చంద్రయాన్-3 గురించి వివరిస్తున్న వెంకటనారాయణ

కర్రతో కొట్టి.. ఉరివేసి..

- భార్యను కడతేర్చిన భర్త..
- కాశిగూడెంలో ఘటన

స్టేషన్‌ఘన్‌పూర్: మద్యానికి బానిసైన భర్త.. భార్యను దారుణంగా కడతేర్చాడు. కర్రతో కొట్టడంతో పాటు విద్యుత్ ప్లగ్‌లలో వైర్లు పెట్టి కరెంట్ షాక్ పెట్టి హింసించాడు. అనంతరం నిద్రిస్తున్న సమయంలో ఉరివేసి హత్య చేశారు. ఈ ఘటన మండలంలోని రంగరాయగూడెం శివారు కాశిగూడెంలో జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం కాశిగూడేనికి చెందిన షేక్ ఖాసీమ్ కుమార్తె సయ్యద్ హజరత్‌బీ(28)కి తొర్రూరు మండలం హరిపిరాలకు చెందిన అమీర్‌తో పన్నెండేళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి ఇద్దరు కుమారులున్నారు. హజరత్‌బీ, అమీర్ దంపతులు కొన్నేళ్లుగా కాశిగూడెంలో బండ కొట్టే పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో మద్యానికి బానిసైన అమీర్.. తరచూ భార్యతో గొడవపడేవాడు. తాను మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వమని వేధించేవాడు. ఈ క్రమంలో అమీర్ మంగళవారం రాత్రి ఇంటికి వచ్చి తాగేందుకు డబ్బులు ఇవ్వమని భార్యతో గొడవపడ్డాడు. కర్రతో కొట్టడంతో పాటు విద్యుత్ ప్లగ్‌లలో వైర్లు పెట్టి కరెంట్ షాక్ పెట్టి హింసించాడు. అనంతరం అర్ధరాత్రి ఆమె నిద్రిస్తున్న సమయంలో ఉరివేసి హత్య చేసి పారిపోయాడు. బుధవారం ఉదయం హజరత్ మృతిచెంది ఉన్న విషయాన్ని గుర్తించిన ఆమె తండ్రి ఖాసీం చుట్టు పక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న సీఐ రాఘవేందర్ ఘటనా స్థలికి చేరుకుని హత్య జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అనంతరం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కాగా, నిందితుడు పరారీలో ఉన్నాడు.



హజరత్‌బీ (ఫైల్)

కొడుకుపై తండ్రి హత్యాయత్నం

- ఆలేరులో ఘటన.. కేసు నమోదు

నెల్లికుదురు: కొడుకుపై తండ్రి హత్యాయత్నం చేశాడు. ఈ ఘటన ఈ నెల 27న మండలంలోని ఆలేరులో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన జనగాం మౌనిక, నరేశ్‌కు 5 సంవత్సరాల క్రితం వివాహమైంది. వారికి కుమారుడు నవదీప్, కూతురు ఉన్నారు. నరేశ్ మద్యానికి బానిసై భార్య మౌనికను రోజూ కొడుతున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 15న కూడా మద్యం సేవించి వచ్చి కొట్టగా మౌనిక తన తల్లిగారి ఊరు సూరిపెల్లికి వెళ్లిపోయింది. నరేశ్ ఈ నెల 27న సూరిపెల్లికి వెళ్లి భార్యతో గొడవపడి కుమారుడు నవదీప్‌ను తనతో ఇంటికి తీసుకెళ్లాడు. అనంతరం మద్యం మత్తులో అదే రోజు రాత్రి కుమారుడిపై హత్యాయత్నానికి పాల్పడాడు. ఈ ఘటనను చూసిన గ్రామస్తులు బాబుని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించి మౌనికకు విషయం తెలిపారు. మౌనిక ఫిర్యాదు మేరకు నరేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.క్రాంతికిరణ్ వివరించారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి బలవన్మరణం

మరిపెడ: కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని మాకుల తండాలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మాకులతండాకు చెందిన గుగులలోతు అమృ(27) తనకున్న కొద్దిపాటి వ్యవసాయ భూమిలో భార్య ప్రమీలతో కలిసి వ్యవసాయ చేస్తున్నాడు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదురుకావడం, కుటుంబ పోషణ గడవకపోవడంతో భార్యాభర్తల మధ్య తరుచూ గొడవలు జరుగుతుండేవి ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం వ్యవసాయ భూమి వద్ద అమృ పురుగుల మందు తాగడంతో గమనించిన భార్య.. చుట్టుపక్కల వారి సాయంతో చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతిచెందాడు. మృతుడికి ఒక కుమార్తె, ఇద్దరు కుమారులున్నారు.

కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్ట్ సీజ్

- కంపెనీపై దాడి.. రూ.2.88 లక్షల విలువైన 20 క్వింటాళ్ల పేస్ట్ స్వాధీనం
- ముగ్గురిపై కేసు నమోదు

ఖిలా వరంగల్: వరంగల్ నగరంలోని కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్ట్ తయారీ కంపెనీలపై టాస్క్‌ఫోర్స్ అధికారులు ఆకస్మికంగా దాడి చేసి ముగ్గురు నిర్వాహకులపై కేసు నమోదు చేశారు. వారినుంచి రూ.2.88లక్షల విలువైన 20క్వింటాళ్ల అల్లం, వెల్లుల్లి పేస్ట్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ ఉర్సు కరీమాబాద్‌కు చెందిన గాయి సతీష్ శ్రీభద్రకాళీ మాత అల్లం, వెల్లుల్లి తయారీ చేసే కంపెనీ ఏర్పాటు చేయగా, ఆదే ప్రాంతానికి చెందిన బిలకిష్ అబువాని మరో కంపెనీ స్థాపించాడు. అదే ప్రాంతానికి చెందిన కూరపాటి నాగరాజు కూడా జై గణేష్ అల్లం, వెల్లుల్లి పేస్ట్ కంపెనీ ఉంది. ముగ్గురు రసాయనాలు కలిపి పేస్ట్ విక్రయిస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ అధికారులకు పక్కా సమాచారం అందింది. సీపీ రంగనాథ్ ఆదేశాలు.. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ సూచనల మేరకు పోలీసులు బుధవారం రాత్రి సతీష్, బిలకిషన్ అబువాని, నాగరాజుకు చెందిన కంపెనీలపై ఆకస్మిక దాడి చేశారు. ముగ్గురుపై కేసు నమోదు చేసి వారినుంచి అల్లం, వెల్లుల్లి పేస్ట్, తయారీకి ఉపయోగించే ముడిసరుకులను సీజ్ చేశారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు పెండ్యాల దేవేందర్, రాంబాబు, ఫుడ్‌సేఫ్టీ అధికారులు పాల్గొన్నారు.

రౌడీషీటర్ దారుణ హత్య..

- కాంట్రాక్ట్ డబ్బులు అడిగినందుకు ఘాతుకం..
- శివనగర్‌లో కలకలం
- పోలీసుల అదుపులో ఓ నిందితుడు?
- కొరవడిన నిఘా.. యథేచ్ఛగా హత్యలు

ఖిలా వరంగల్: వరంగల్ మిల్స్ కాలనీ పోలీసు స్టేషన్ పరిధిలో వరుస హత్యలు కలకలం సృష్టిస్తున్నాయి. కొన్ని రోజుల క్రితం ఇదే పీఎస్ పరిధిలో ఇద్దరు నిందితులు ఓ వృద్ధుడిని గొంతు కోసి అతికిరాతంగా హత్య చేసిన విషయం తెలిసిందే. ఆ ఘటన మరవక ముందే మంగళవారం అర్ధరాత్రి ఓ రౌడీషీటర్‌ను ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన వ్యక్తులు రాడ్లతో తలపై కొట్టి దారుణంగా హతమార్చారు. ఈ ఘటన నగర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. పోలీసుల కథనం ప్రకారం వరంగల్ శివనగర్‌కు చెందిన ఎస్‌డీ నజీర్ (37) వరంగల్ రైల్వేస్టేషన్‌లో సబ్ కాంట్రాక్ట్ తీసుకుని మొబైల్ క్యాంటీన్ నడిపిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇతడిపై మిల్స్‌కాలనీ, ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్‌లో పలు కేసులు నమోదై ఉన్నాయి. అతనిపై రౌడీషీట్ ఉంది. ఇదిలా ఉండగా ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన పదిమంది వ్యక్తులు బతుకు దెరువు కోసం వరంగల్ వచ్చి శివనగర్‌లో అద్దెకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరంతా రైల్వే స్టేషన్ ప్రాంగణం, రైళ్లల్లో ఎలక్ట్రానిక్స్ గూడ్స్, కీచైన్స్, పర్సులు విక్రయిస్తారు. వీరు స్టేషన్‌లో చిరువ్యాపారం చేసుకునేందుకు సబ్ కాంట్రాక్టర్, మృతుడు నజీర్‌కు నెల వారీగా అద్దె చెల్లించాలి. అయితే చిరువ్యాపారం చేస్తున్నారు. కానీ కాంట్రాక్ట్ డబ్బులు చెల్లించకుండా తిరుగుతున్నారు. రేపు మాపు అంటూ దాటవేస్తున్నారు.

ఇంటికి వెళ్తూ హత్యకు గురై..

మంగళవారం అర్ధరాత్రి నజీర్ క్యాంటీన్ బంద్ చేసి ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో శివనగర్‌లోని తిరుమల బార్ పక్కనే ఉత్తర్‌ప్రదేశ్ వారు అద్దెకుంటున్న గదికి చేరుకున్నాడు. ఇరువురు మధ్య కాంట్రాక్ట్ డబ్బుల విషయంలో గొడవ జరగడంతో వారిని నిలదీశాడు. దీంతో ఆగ్రహానికి లోనైన వారు ఐరన్‌రాడ్లతో నజీర్ తలపై బలంగా కొట్టడంతో రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందారు. నజీర్ చనిపోయాడని నిర్ధారించుకున్న అనంతరం వారు గది నుంచి పారిపోయారు. ఈవిషయం తెలిసిన వెంటనే మిల్స్‌కాలనీ ఎస్సై శ్రీలత, క్లూస్ టీమ్ అధికారులు ఘటనా స్థలికి చేరుకున్నారు. హత్య జరిగిన తీరును పరిశీలించి మృతుడి బంధువులు, స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. అనంతరం నజీర్ మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. మృతుడి భార్య రిజ్వాన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై శ్రీలత తెలిపారు. కాగా, నగరంలో నిఘా కొరవడడంతోనే వరుస హత్యలు జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.



నజీర్ (ఫైల్)

పోలీసులు అదుపులో నిందితుడు..?

నజీర్‌ను దారుణంగా హత్య చేసిన అనంతరం నిందితులు పరారయ్యారు. వీరిలో ఓ వ్యక్తిని రైల్వేస్టేషన్‌లో పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్ తరలించినట్లు సమాచారం. పదేపదే తమను కాంట్రాక్ట్ డబ్బులు అడగడం వల్ల.. పైగా బెదిరించడంతో ఆత్మరక్షణకు హత్య చేశామని చెప్పినట్లు తెలుస్తోంది.

తల్వార్ ఫ్లెక్సీ తొలగింపు

హసన్‌పర్తి: కేయూ పోలీస్‌స్టేషన్ పరిధి గోపాలపురం పాత గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఓ పార్టీ నాయకుడు తన జన్మదినాన్ని పురస్కరించుకుని తల్వార్ పట్టుకుని ఉన్న ఫొటోతో ఫ్లెక్సీ ఏర్పాటు చేశాడు. బుధవారం గుర్తించిన పోలీసులు ఫ్లెక్సీని తొలగించారు.



ఫ్లెక్సీని తొలగిస్తున్న పోలీసులు



నీలి చందమామ..సొగసు చూడతరమా అన్నట్టు కనిపించింది. బుధవారం రాత్రి చంద్రుడు.. భూమికి దగ్గరగా రావడంతో చాలా పెద్దగా కనిపించారు. వరంగల్ నగరంలో రాత్రి 9.30 గంటల ప్రాంతంలో ఇలా నీలిరంగులో సూపర్ మూన్ దర్శనమిచ్చారు.

- సాక్షి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, హనుమకొండ